క్లుప్తంగా

బత్తిన సుబ్బారావు సేవలు చిరస్మరణీయం



బత్తిన సుబ్బారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్‌ఐ: మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు సేవలు చిరస్మరణీయమని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్‌లో బుధవారం బత్తిన సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకుడు బర్రే కొండబాబు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని బత్తిన సుబ్బారావు కమ్యూనిటీ హాలు ఆవరణలో దివంగత మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు వర్ధంతిని మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, వైఎస్సార్ సీపీ నేత ఎలుగొండ లక్ష్మి తదితరులు బత్తిన సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదర్శప్రాయుడు

సీటీఆర్‌ఐ: నిస్వార్థ రాజకీయ నాయకుడు బత్తిన సుబ్బారావు అందరికీ ఆదర్శప్రాయుడని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా పేపరుమిల్లు వద్ద గల విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. సమాజ విశ్లేషకులు అడబాల మరిడయ్య మాట్లాడుతూ ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రిగా పనిచేసి నిస్వార్థ జీవితం గడిపిన వ్యక్తి సుబ్బారావు అన్నారు.

జీవిత బీమా ఉద్యోగుల ధర్నా



భోజన విరామ సమయంలో ధర్నా చేస్తున్న జీవిత బీమా ఉద్యోగులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించేలా చట్టం చేయాలంటూ ఢిల్లీ రాంలీల మైదానంలో జరుగుతున్న కిసాన్ మజ్దూర్ సంఘ్ ర్యాలీకి మద్దతుగా జీవిత భీమా ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయం ధర్నా నిర్వహించారు. స్థానిక మోరంపూడి జీవిత బీమా సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కోదండరామ్, జి.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికుల కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు అందించాలని, పెన్షన్ రూ.10 వేలు రూపాయలుగా పెంచాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ సౌకర్యాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని సింగవరానికి చెందిన చొక్కా శ్రీనివాసరావు (46) పాము కాటుకు గురై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని హెడ్‌కానిస్టేబుల్ గోవిందరాజు బుధవారం తెలిపారు. వ్యవసాయ కూలీ అయిన శ్రీనివాసరావు మంగళవారం లంకభూమిలో మొక్కజొన్న చేలో పనికి వెళ్లగా.. పొడపాము ఎడమ కాలుపై కాటు వేసింది. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకు వెళ్లగా, అదే రోజు రాత్రి 8.30 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు బాల మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చింతాలమ్మ సిరిమానోత్సవం

సీతానగరం: రఘుదేవపురం గ్రామదేవత చింతాలమ్మ సిరిమానోత్సవాన్ని కొలగారం, గ్రామ రైతుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సిరిమాను ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆటో యూనియన్ ఆర్థిక సాయం



శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

రాజానగరం: మండలంలోని పాలచర్లకు చెందిన ఆటో డ్రైవర్ కడియం శ్రీనివాస్ (40) హఠాన్మరణంతో ఇబ్బందుల్లో ఉన్న అతడి కుటుంబానికి దివాన్ చెరువు ఆటోయూనియన్ అండగా నిలిచింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అతడి భార్య, ఇద్దరు ఆడపిల్లలకు యూనియన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులందరూ కలిసి రూ.65 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. ఒకటో తరగతి, నర్సరీ చదువుతున్న ఆ ఇద్దరు పిల్లల చదువులకు యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అవిసె మొక్కలు.. రక్షణ కవచాలు

- నర్సరీల్లో ప్లాంట్లకు ఎండ నుంచి రక్షణ
- వేసవిలో విరివిగా వినియోగం

కడియం: కడియం ప్రాంత నర్సరీల్లో ఎంతో విలువైన ఆర్నమెంట్, పండ్లు, పువ్వుల మొక్కలను పెంచుతారు. వీటిలో కొన్ని రకాల మొక్కలకు పరిమితికి మించిన ఉష్ణోగ్రతలు పెరిగితే చనిపోవడమో, నాణ్యత దెబ్బతినడమో జరుగుతుంది. ఇటువంటి వాటిని కాపాడుకునేందుకు ప్రస్తుత వేసవి సీజన్‌లో రైతులు వివిధ రకాల పద్ధతులు అనుసరిస్తారు. వాటి మధ్య అవిసె మొక్కలను నాటడం ద్వారా మొక్కలపై నేరుగా సూర్యరశ్మి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. మార్చి చివరి వారంలో అవిసె గింజలను తీసుకువచ్చి మొక్కల వరుసల మధ్య నాటుతారు. ఇవి 15 నుంచి 30 రోజుల వ్యవధిలో ఏపుగా పెరుగుతాయి. దీంతో వాటికింద ఉన్న మొక్కలకు నీడ ఏర్పడుతుంది.

అత్యంత చౌకైన పద్ధతి

వేసవి ఎండల తీవ్రత నుంచి విలువైన మొక్కలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న అత్యంత చౌకైన పద్ధతిగా అవిసె మొక్కల వినియోగాన్ని నర్సరీ రైతులు చెబుతారు. తక్కువ సమయంలోనే ఏపుగా పెరగడంతో పాటు, కింద ఉండే మొక్కలను నీడనివ్వడం వీటి ప్రత్యేకత. జూన్ – జూలైలో వర్షాలు మొదలయ్యే సమయానికి అవిసె మొక్కలను నరికేస్తారు. అప్పటి వరకు అంటే దాదాపు రెండు నెలల పాటు ఆర్నమెంట్, పండ్లు, పువ్వుల ప్రత్యేక మొక్కలకు రక్షణగా అవిసె మొక్కలను వినియోగిస్తారు. ప్రస్తుతం కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట, పొట్టిలంక, వీరవరం, దుళ్ళ తదితర గ్రామాల్లోని నర్సరీల్లో వీటిని పెంచారు.



నర్సరీ మొక్కల మధ్య ఏపుగా ఎదిగిన అవిసె మొక్కలు



ఎండ తీవ్రత నుంచి రక్షణకు మొక్కల మధ్య నాటిన స్వీట్‌కార్న్ మొక్కలు

కొన్ని ఇబ్బందులు

అవిసె మొక్క వినియోగం ద్వారా వేసవి ఉష్ణోగ్రతల నుంచి మొక్కలను కాపాడుకునే అవకాశం ఉన్నప్పటికీ, సున్నితమైన రకానికి చెందిన ఈ మొక్క వినియోగంలో కూడా ఇబ్బందులున్నాయని పలువురు రైతులు చెబుతున్నారు. వేసవి తీవ్రత పెరిగే క్రమంలో బలమైన ఈదురు గాలులు వీస్తే అవిసె మొక్కలు విరిగిపోతాయి. అలాగే గొంగళి జాతికి చెందిన పురుగుల బెడద ఈ మొక్కకు ఎక్కువగా ఉంటుంది. నీడను ఇస్తున్నప్పటికీ, కిందఉండే మొక్కలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించకపోతే అవిసె మొక్కల మీద వ్యాపించే వివిధ రకాల పురుగుల కారణంగా విలువైన మొక్కలు దెబ్బతింటాయి. గతంలో కేజీ రూ.800 – రూ.వెయ్యి మధ్య అవిసె గింజలు లభ్యమయ్యేవి. కానీ ఇప్పుడు నాణ్యమైన అవిసె విత్తనాలు కావాలంటే కేజీకి దాదాపు రూ.మూడు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

స్వీట్‌కార్న్‌తో..

మొక్కల మధ్య స్వీట్‌కార్న్ నాటడం ద్వారా కూడా ఎండ తీవ్రత నుంచి రక్షణ కల్పించొచ్చని పలువురు రైతులు చెబుతున్నారు. అవిసె మొక్కతో కేవలం వేడి తీవ్రతను మాత్రమే తగ్గించొచ్చని, కానీ స్వీట్‌కార్న్‌ను నాటితే నీడతో పాటు, మొక్కజొన్న పొత్తుల ద్వారా అదనపు ఆదాయం కూడా సమకూరుతుందంటున్నారు. మొక్కల వరుసల మధ్య నిర్ణీత దూరంలో స్వీట్‌కార్న్‌ను నాటుకోవడం ద్వారా కింద ఉండే మొక్కలకు నీడ కల్పించడంతో పాటు స్వీట్‌కార్న్ కూడా లభిస్తుంది. ఇటీవల రైతులు అవిసెకు బదులుగా స్వీట్‌కార్న్‌ను వినియోగిస్తున్నారు.

మొక్కలను కాపాడుకోవాలి

వేసవి ఎండల తీవ్రత పెరిగితే మొక్కలను ప్రత్యేక శ్రద్ధతో కాపాడుకోవాలి. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో పెరిగే ఉష్ణోగ్రతల నుంచి మొక్కలకు నీడను కల్పించడంలో అవిసె, స్వీట్‌కార్న్ వంటివి అతి తక్కువ ఖర్చుతో సాధ్యమవుతుంది. ఇవి రెండు కూడా వేగంగా ఎదుగుతాయి. దీంతో వీటి కింద ఉండే మొక్కలకు నీడ లభిస్తుంది. తద్వారా వేసవి వడగాల్పుల దెబ్బ మొక్కలకు తగలదు. అవిసెతో ఎటువంటి అదనపు ఆదాయం ఉండదు. కానీ స్వీట్ కార్న్‌ను నాటుకుంటే పొత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.

– ఎం.శ్రీనివాసరావు, నర్సరీ రైతు, కడియపులంక

అక్రమ మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఎస్‌ఈబీ సౌత్‌స్టేషన్ పరిధిలో గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ వివిధ కేసులలో పట్టుబడిన సారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులో పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు తెలిపారు. ఐదు నెలల్లో 105 కేసులకు సంబంధించి 1,717.9 లీటర్ల సారా, డ్యూటీ పెయిడ్ లిక్కర్ 13 కేసులలో 72.01 లీటర్లు (376 మద్యం బాటిళ్లు), నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ మూడు కేసులలో 207.15 లీటర్ల (850 మద్యం బాటిళ్ల)ను బుధవారం సౌత్‌స్టేషన్‌లో ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్సై ఎం.రామశేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గుడ్‌మార్నింగ్'

- ఎంపీ భరత్‌రామ్
- క్వారీ సెంటర్‌లో పర్యటన



రైతుబజార్‌లో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజాసమస్యలు పరిష్కరించేందుకే గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక 49వ డివిజన్ క్వారీ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్వారీ మార్కెట్ రైతుబజార్‌లో సమస్యలు, ఇబ్బందులు, విక్రయాలపై ఆరాతీశారు. రైతుబజారులో వ్యాపారులు రోజుకు రూ.30 లక్షలకు పైగానే కూరగాయలు విక్రయిస్తారని రైతు బజార్ ఎస్టేట్ మేనేజర్ రాయుడు శ్రీనివాసరావు తెలిపారు. క్వారీ మార్కెట్‌లోని రైతుబజార్లో 67 దుకాణాలు ఉన్నాయని, వీటిలో 24 అద్దె ప్రాతిపదికన, మరో 43 ఉచితంగా రైతులకు కేటాయించామన్నారు. రైతుబజారులో ఏమైనా సదుపాయాలు కల్పించాలా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతుబజార్లను మరింత అభివృద్ధి ఎలా చేయవచ్చు అనే విషయాలపై సంబంధిత అధికారులతో ఎంపీ మాట్లాడారు. కోల్డ్ స్టోరేజ్ రూమ్ ఉన్నా పనిచేయడం లేదని తెలుసుకుని దానిని పరిశీలించారు. వేసవిలో ఇబ్బంది లేకుండా బాగుచేయించాలని మేనేజర్‌కు ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న చేపల బజార్‌ను పరిశీలించారు. రోడ్డు పక్కనే చేపల దుకాణాలు పెట్టడం వల్ల తమవద్ద ఎవరూ కొనడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేపల బజారులోనే చేపలు విక్రయించేలా తగు చర్యలు తీసుకోమని ఎంహెచ్ఓ వినూత్నకు ఎంపీ ఆదేశించారు. డ్వాక్రా బజార్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని భరత్‌రామ్ పరిశీలించారు. ప్రజల విజ్ఞప్తిపై వీధిలైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి బర్రే కొండబాబు, గారా చంటిబాబు, ఉల్లూరి రాజు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యం

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- రేపటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'



జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అన్నివర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. రూరల్ నియోజకవర్గంలో శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి 'జగనన్నే మాభవిష్యత్' కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయానికి ముగ్గురు చొప్పున కన్వీనర్లు, ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున గృహసారథులతో క్షేత్రస్థాయిలో అత్యంత క్రియాశీలక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆయన పాలనపై ప్రజలు పూర్తి విశ్వసనీయత కనబరుస్తున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, జిల్లా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్, దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బిల్డర్ చిన్న, పార్టీ నాయకులు పాలిక శ్రీను, పెయ్యల రాజేష్, కొప్పినీడి ప్రసాద్ బాబు (రాజమౌళి), తలారి వర ప్రసాద్, సబ్బెళ్ల విజయ దుర్గారెడ్డి, అంగాడి సత్యప్రియ, పుచ్చా ప్రసన్న కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప జన్మనక్షత్ర పూజలు

కడియం: ఆధ్యాత్మిక వేత్త తాడాల వీరవెంకట్రావు గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి. గురుస్వామి ఇంటి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీఠంలో కేరళ దేవస్థానంలో జరిగే విధానంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకాలు చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు హాజరయ్యారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభం

కడియం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం కడియంలో ప్రారంభమవుతుందని ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో స్థానిక వినాయకుడి గుడి వద్ద ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. కలెక్టర్ కె.మాధవీలత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు పాల్గొంటారన్నారు.

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

- కొనియాడిన వక్తలు
- ఘనంగా మాజీ ఉపప్రధాని జయంత్యుత్సవం



బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆకుల వీర్రాజు, చందన నాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరులోని అరుంధతీపేటలో బుధవారం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్, దివ్యాంగుల సెల్ అధ్యక్షులు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, నాయకులు యెనుముల త్యాగరాజు, పెయ్యల రాజేష్, ఎలుగొండలక్ష్మి, మత్సేటిశివ, సోమనశ్రీనివాస్, మేడపాటి సద్గుణరామారెడ్డి పాల్గొన్నారు. స్థానిక దేవీచౌక్ సెంటర్‌లోని జిల్లాపశు సంవర్థకశాఖాధికారి కార్యాలయంలో డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. హుకుంపేటలోని డీఆర్‌డీఏ – వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి నివాళులర్పించారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కడియంలో కొల్లి రవలిన్, ఎమ్మార్పీఎస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కడియం పోలీసు ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్, వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

● జేగురుపాడులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఆ గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఆర్బీకే ఎదురుగా గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దుళ్లలో వేడుకలు నిర్వహించారు. మురమండలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పుష్పాంజలి ఘటించారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: ధవళేశ్వరం ఇందిరా కాలనీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకుడు కొడమంచిలి సూర్య ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లరసం, రొట్టెలు పంపిణీ చేశారు. జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడుస్తామని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. ధవళేశ్వరం ఇందిరా కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పోరాటయోధుడు

సీటీఆర్‌ఐ: నగరంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. 30వ డివిజన్ చర్చిపేటలో జరిగిన వేడుకలకు రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి హాజరయ్యారు. రుడా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రుడా వైస్‌చైర్మన్ కె.దినేష్ కుమార్, సెక్రటరీ జి.శైలజావల్లీ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ, సీహెచ్ పాపారావు, జి. వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న షర్మిలారెడ్డి



కడియంలో పుష్పాంజలి ఘటిస్తున్న ఇన్‌స్పెక్టర్ తిలక్, గిరజాల బాబు



జేగురుపాడులో పుష్పాంజలి ఘటిస్తున్న సతీష్‌చంద్రస్టాలిన్